క్లుప్తంగా

నేడు మండల సర్వ సభ్యసమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.ఎస్.ఎస్.కె.పట్నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను సోపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాల భాస్కర్, కుమ్మపల్లి ప్రాథమిక పాఠశాలను ఎస్.కె.ఆర్.పురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణారావు మంగళవారం సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యా బోధన, మధ్యాహ్న భోజనాలు, మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం


ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి స్థానిక వ్యాపారి కిల్లంశెట్టి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు రూ.51,116 విరాళం ప్రకటించారు. మంగళవారం వారి నివాసంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, దాసరి రవి, ఎస్.వి.జి. అప్పికొండ, ఆదిబాబుకు నగదు అందజేశారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

చీపురుపల్లి: దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదని, నాయీ బ్రాహ్మణులమంతా ఆయనకు రుణపడి ఉంటామని పట్టణ నాయీ బ్రాహ్మణుల సంఘం ప్రతినిధి కూర్మాపు సింహాచలం మంగళవారం తెలిపారు. దేశ చరిత్రలోనే ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి కల్పించని అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ సామాజిక వర్గానికి కల్పించారని చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తున్న జగన్ మరో పది కాలాలు ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నామని అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

జామి: మండలంలోని గొడికొమ్ము పంచాయతీ పరిధిలోని అంబచెరువు, గోపన్నచెరువులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ సతీష్ మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు. వేతనదారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.257 గరిష్ఠ వేతనం వస్తుందని చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ కేదారేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్ తదితరులు ఎంపీడీఓ వెంట ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ నూతన కార్యవర్గం

జామి: మండల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గాన్ని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి.ఎస్.ఆర్.కె.ఈశ్వరరావు ఆధ్వర్యం లో భీమసింగి బాలాజీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.వెంకటనాయుడు, అధ్యక్షుడిగా వి.వాసుదేవరావు, సహ అధ్యక్షురాలిగా రూపవతి, ప్రధాన కార్యదర్శిగా ఎం.తాతంనాయుడు,కోశాధికారిగా బి.శ్రీధర్, పది మంది కార్యదర్శులను సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే జిల్లా శాఖకు కౌన్సిలర్లుగా కె.వెంకటరావు, విజయకృష్ణ, జి.వెంకటరావు, వై.శ్యామల, ఏ.రాము,ఆర్.దేముడుబాబు, ఎల్.రమేష్‌నాయుడిని ఎంపిక చేశారు. అనంతరం నూతనకార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కరాటేతో ఆత్మరక్షణ


వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులతో సీఐ సింహాద్రినాయుడు,ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్.కోట సీఐ ఎస్.సింహాద్రినాయుడు అన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని శాభవి లేఅవుట్‌లో విక్టరీ షూటోకాన్ కరాటే అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఆర్.మల్లికార్జున్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు మంగళవారం బెల్ట్ టెస్ట్ గ్రేడింగ్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 31 మంది విద్యార్థులు పాల్గొనగా వీరికి వివిధ రకాల బెల్టులను, సర్టిఫికెట్లను అందజేశా రు. తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు,ఎస్ఐ ముకుందరావు, మార్షల్ ఆర్ట్స్ నిపుణులు వి.శ్రీనివాస్, పాకలపాటి రాజు, ప్రసాద్‌గౌడ్, టి.సాయికుమార్ పాల్గొన్నారు.

పార్టీకి రథసారథులు మీరే

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి


సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు


'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం కిట్లను గృహసారథులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

శృంగవరపుకోట: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వైఎస్సార్‌సీపీ రథసారథులని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకూ అందుతు న్నాయా లేదా చూడాల్సిన బృహత్తర బాధ్యత మీ భుజాలపైనే ఉందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో స్థానిక ఆకులడిపో వద్ద మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, పార్టీలకతీతంగా, పారదర్శకంగా ప్రజలకు పథకాలను అందించేందుకే గ్రామ వలంటీర్ వ్యవస్థను నెలకొల్పారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఆ పార్టీ సానుభూతిపరులు, లంచాలు ఇచ్చిన వారికే పథకాలు ఇచ్చే వారని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలతో ప్రమేయం లేకుండా పథకాలు అందుతున్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని చెప్పారు. అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలతో మేలు జరుగుతుంటే టీడీపీ, జనసేన, కొన్ని పత్రికలు, మీడియా చానళ్లు చూసి ఓర్వలేకపోతున్నాయని, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. జనసేన, టీడీపీకి ప్రజల్లో ఉనికి లేదని, పత్రికల్లోనే బతుకుతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపైవారి దుష్ప్రచారాలు, ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు.

ఎస్.కోటకు రూ.1,000 కోట్లు

ఎస్.కోట నియోజకవర్గ ప్రజలకు ఈ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రూ.1,000 కోట్లు అందించిందని చెప్పారు. ఒక్క రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా ఈ నగదు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో వేశామని తెలిపారు. విశాఖ-అరకు రోడ్డును 4 లైన్ల నేషనల్ హైవేగా అభివృద్ధి చేశామని, ఎస్.కోట ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచామని వివరించారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయిల ఏర్పాటు చేసి తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.216 కోట్లు మంజూరు చేసిందని, ఇవన్నీ సీఎం జగన్ వల్లే జరిగాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. గృహసారథులు, కన్వీనర్లు స్థానిక పార్టీపెద్దలతో కలిసి పనిచేయాలన్నారు. నిత్యం రాష్ట్రాభివృద్ధి కోసం పరితపిస్తున్న బడుగు బలహీన వర్గాల పక్షపాతి జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు.

జగనన్నకు అండగా నిలబడదాం

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ రాష్ట్రానికి దశ, దిశ అయిన సీఎం జగనన్నకు అంతా అండగా ఉందామని అన్నారు. అవినీతికి ఆస్కారం లేని వలంటీర్ వ్యవస్థ, గ్రామాల్లోనే సమస్యలు సత్వర పరిష్కారం కోసం సచివాలయ వ్యవస్థను సీఎం జగన్ నెలకొల్పారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలు పేదల పక్షపాతికి, పెత్తందారీ వ్యవస్థకు మధ్య జరుగుతున్నాయన్నారు. పేదోడి పక్షాన వైఎస్సార్‌సీపీ ఉందన్నారు.

చంద్రబాబు చేసింది శూన్యం

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ పండగొస్తే పప్పులు, ఎన్నికల ముందు పసుపు,కుంకుమ ఇవ్వడం తప్ప రాష్ట్రానికి చంద్రబాబు చేసింది శూన్యమని అన్నారు. సీఎం జగన్, ప్రభుత్వంపై ప్రతిపక్షాల ప్రచారం తిప్పికొట్టడం, అమలు చేస్తున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వివరించాలని కోరారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' అన్న కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పి.వెంకటరమణ, ఐ.సుధారాజు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, షేక్ రహ్మాన్, సర్పంచ్‌లు సంతోషికుమారి, సరోజిని, యామిని, త్రినాథమ్మ, సూర్యనారాయణ, జె.సూర్యారావు, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కేత వీరన్న, డి.పార్వతి, పి.రామకృష్ణ, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో తాగునీటి సౌకర్యం


బోరు తవ్వకాలను పూజలు చేసి ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులను ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ మంగళవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలు వెచ్చించి అమ్మవారి ఆలయ ఆవరణలో భక్తుల కోసం తాగు నీటి బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, కమిటీ ప్రతినిధులు వంకల కృష్ణ, అడ్డాల రవి, అప్పలనాయుడు, ముల్లు పైడిరాజు, దాలయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం


ప్రగతి నివేదికలను వివరిస్తున్న అధికారులు

కొత్తవలస: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ వై.పద్మజ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం మంగళ వారం నిర్వహించారు. వ్యవసాయం,విద్యుత్, విద్య, ఆరోగ్యం, రెవెన్యూ తదితర 17 శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను అధికారులు సభకు వివరించారు. విద్యుత్ శాఖ ఏఈ అప్పారావు మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని 9 గ్రామాల్లో ప్రజల కోరిక మేరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.22 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు.నాడు-నేడులో భాగంగా పాఠశాలల్లో అదనపు భవనాలు,ప్రహరీల నిర్మాణాలకు సంబంధించిన పనులను ఎం-బుక్ రికార్డింగ్‌లో సంబంధిత ఏఈ రాముడు అలసత్వం వహిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసేలా చూడాలని హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు ఎంపీటీసీలు, సర్పంచ్‌లను కోరారు. తహసీల్దార్ ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయితీ సర్పంచ్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని


ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి సూచించారు. మండలంలోని పుర్రేయవలస పంచాయతీ పరిధి రామన్నదొర చెరువులో ఉపాధి హామీ పనులను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పుర్రేయవలస కొత్తగా పంచాయతీ కావడంతో సాంకేతిక కారణాల వల్ల పంచాయతీ ఏర్పడిన తర్వాత నుంచి ఉపాధి పనులు నిలిచిపోయాయని చెప్పారు. సమస్యను పరిష్కరించి పనులు మంజూరు చేయించామని తెలిపారు. రామలింగాపురం సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, మాజీ సర్పంచ్‌లు కంది పాపినాయుడు, కంది అప్పారావు, నాయకులు జమ్ము అప్పలనాయుడు, శ్రీరాములు,జనార్దన్, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం ఏనుగువలస అంగన్‌వాడీ కేంద్రానికి ఆయాగా నియమితులైన కింతాడ రమ్యకు ఎంపీపీ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ రాజరాజేశ్వరి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, స్థానిక సర్పంచ్ మీసాల నాగభూషణ్, ఎంపీటీసీ కంది శ్రీనివాసరావు, నాయకులు జగదీష్, రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పైడి మంగమ్మ పాల్గొన్నారు.

శివరాంలో మెగా వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలో శివరాం గ్రామంలో అనిల్‌నీరుకొండ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల సహకారంతో మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 500 మందికి వైద్యులు వివిధ పరీక్షలు చేశారు. శిబిరంలో ఆర్థోపెడిక్ సమస్యలకు వైద్యుడు సీహెచ్.గణేష్, జనరల్ ఆరోగ్యసమస్యలకు వైద్యుడు బాలరామకృష్ణ, నేత్ర సమస్యలకు ఆప్తాలమిక్ ఐ.మౌనిక, గైనిక్ సమస్యలకు డాక్టర్ వై.దేవి, చిన్నారులకు పీడియాట్రిక్ పి.మౌనిక వైద్య సేవలు అందించారు. వివిధ శస్త్ర చికిత్సలకు 50 మందిని ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గవిడి శ్రీధర్, గవిడి దాలినాయుడు,వైస్ సర్పంచ్ రెడ్డి రామ్మూర్తి, స్థానిక యువత పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు


సమవి పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మండల కేంద్రం సమీపంలోని పురిటిపెంటలో ఉన్న సమవి, హర్షవర్ధన్ ప్రైవేటు పాఠశాలల్లో ఎంఈఓ విమలమ్మ మంగళవారం తనిఖీలు చేశారు. పాఠశాలల్లో తరగతి గదులు, వసతులను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఆమె వెంట నోడల్ ఆఫీసర్, లోగిశ హైస్కూల్ హెచ్ఎం దన్నాన తిరుపతిరావు, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు ప్రదీప్ కుమార్, గోపి, సీఆర్పీ రెడ్డి ఉన్నారు.

నేడు గుర్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

గుర్ల: మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు తెలిపారు.స్థానిక సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో వారు మంగళవారం సమావేశం నిర్వహించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు. అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, ప్రసాద్, సీతారాం, రమేష్ పాల్గొన్నారు.

భూసర్వేకు సహకరించండి

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేకు రైతు లంతా సహకరించాలని తహసీల్దార్ ఎం.సురేష్ కోరారు. మండలంలోని పి.కె.పాలవలస, గొల్లలపాలెం పంచాయతీల్లో భూసర్వే నిర్వహణ కోసం రైతులతో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడతూ సమగ్ర భూరీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. సిబ్బంది సర్వే చేసే సమయంలో రైతులంతా తమ పొలాల వద్ద ఉండాలని సూచించారు. స్థానిక నాయకులు గొర్లె శ్రీరాములనాయుడు,గొర్లె వెంకటరమణ, రెల్లి అప్పలనాయుడు, బైరెడ్డి లక్ష్మణ,వలిరెడ్డి లక్ష్మణ, వలిరెడ్డి శ్రీరాములనాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


బాధిత బాలిక కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లి: మెరకముడిదాం మండలం గర్భాం గ్రామానికి చెందిన కగడల రంబాబు, రమ దంపతుల కుమార్తె భవిష్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.70 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బాలిక తండ్రికి చీపురుపల్లిలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో ఎంపీ తనయుడు వంశీకృష్ణ మంగళవారం అందజేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం శ్రీరామ రక్షలా నిలుస్తోందని అన్నారు. వార్డు మెంబర్ తమ్మిన శేఖర్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గజపతినగరం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గజపతినగరం మండలం అధ్యక్షుడు బూడి వెంకటరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ మండల కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లు, లయన్స్ క్లబ్ సర్టిఫికెట్లను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు,తదితరులు

వేపాడ: విశాఖపట్నం లయన్స్ క్లబ్ వారు సమకూర్చిన 11 కుట్టుమిషన్లను మండలంలోని బల్లంకి గ్రామంలో మహిళలకు డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చినరామునాయుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు ఉచితంగా అందజేసిన కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి పొందాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొంప తులసి, విశాఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దుర్గా ఆనంద్, సభ్యులు ఎన్.వి.వి.ఎస్ మూర్తి, ఎం.ఎం. మహేష్, వైస్ సర్పంచ్ ధనుంజయ్ నాయకులు కణితి సోమనాథం, కండిపల్లి పెదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

శృంగవరపుకోట: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 'నిక్షయ్‌మిత్రలు'గా చేరి మందులు వాడుతున్న క్షయ వ్యాధిగ్రస్తులకు కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య సూచన మేరకు ఎస్.కోట పట్టణంలో మంగళవారం పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయనివారణ కేంద్రానికి చెందిన అధికారి(డీటీసీఓ) డాక్టర్ రామేశ్వరిప్రభు మాట్లాడుతూ విధిగా పౌష్టికాహారం తీసుకోవడం, మంచి నిద్ర, ఆహారపు అలవాట్లు పాటించడం, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల అలవాటును మానుకోవడం వల్ల క్షయ వ్యాధిని జయించవచ్చని వ్యాధి గ్రస్తులకు సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, శంకరరావు, రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం


వంగరలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ సుబ్బరాజు

దత్తిరాజేరు/ గజపతినగరం రూరల్: రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని పౌర సరఫరాలశాఖ జోనల్ మేనేజర్ సుబ్బరాజు తెలిపారు. దత్తిరాజేరు మండలంలోని వంగర,పెద మానాపురం, గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట, కొత్తబగ్గాం, సాలిపేట, కొణిశ గ్రామాల్లో రైతుల కల్లాల్లోని ధాన్యం నిల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకా రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎంత మొత్తంలో నిల్వలు ఉన్నాయో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని, రెండు మూడు రోజుల్లో ధాన్యం సేకరణ చేపడతామని తెలిపారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి తొలుత ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఓలు అనురాధ, ధనలక్ష్మి, దత్తిరాజేరు తహసీల్దార్ రమేష్, రెండు మండలాల సీఎస్‌డీటీలు ధనం, రవిశంకర్, టెలికాం బోర్డ్ మెంబర్ దత్తి చిరంజీవి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


దేవుపల్లి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: సచివాలయ సిబ్బంది తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు సూ చించారు. మండలంలోని దేవుపల్లి, ఎం.కొత్తవలస గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించా రు. సచివాలయ సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సచివాలయంలో అందించిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని, ఆ సమస్యలు సచివాలయం పరిధిలో పరిష్కారం కాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఎక్కడా సమస్య పరిష్కారం కాకుంటే అందుకు తగిన కారణాలను అర్జీదారులకు వివరించాలని సూచించారు. జెడ్పీటీసీ వెంట ఎంపీడీఓ దే.వేదవతి, ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, దేవుపల్లి ఎంపీటీసీ రాపాక వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాపాక మనోజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పనిచేస్తున్నారా? లేదా?

- మెరకముడిదాం పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నించిన జెడ్పీచైర్మన్


ఆస్పత్రిలో సేవలపై వైద్యాధికారులు, సిబ్బందిని ప్రశ్నిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఉదయం 11 గంటలవుతోంది.. ఒక్క ఓపీ నమోదుకాలేదు.. అంటే.. మీరు పనిచేస్తున్నారా? లేదా?.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తే ఒక్క ఓపీ కూడా ఎందుకు నమోదుకాలేదు... అంటూ మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ప్రశ్నించారు. వెంటనే డీఎంహెచ్ఓ ఎస్.వి.రమణకుమారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బంది తీరుపై తనకు ఫిర్యాదు అందిందని, విచారణ జరుపుతామని ఆమె తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నాణ్యతాప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ తాడ్డికృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధికమిటీ సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మందుల నిల్వలపై వైద్యాధికారి సాంబమూర్తిని ప్రశ్నించారు. ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాదిరూపాయలు ఖర్చుచేస్తోందని, మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత పీహెచ్‌సీ వైద్యులపై ఉందన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.సీతారామరాజు, ఎంపీడీఓ పి.రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

జాతీయసైన్స్ సదస్సుకు గరివిడి విద్యార్థి


కోమల్ సాయిబాలాజీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): బిహార్ రాష్ట్రంలోని పాట్నానగరంలో మార్చి 9 నుంచి 16 వరకు గవర్న్‌మెంట్ ఆఫ్ ఇండియా(హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 28వ జాతీయ సైన్స్ సదస్సుకు గరివిడి గోదావరి సెకండరీ హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి ఎస్.కోమల్‌సాయిబాలాజీ ఎంపికయ్యాడు. చీపురుపల్లి బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఎంపికల్లో ఈ విద్యార్థి ప్రతిభ కనబరిచి ఈ జాతీయ సదస్సుకు అర్హత సాధించాడు. విద్యార్థిని బాలభవన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సుంకరి రమేష్, స్కూల్ ప్రిన్సిపాల్ రవి అభినందించారు.

నేడు జాబ్ మేళా

గజపతినగరం: నిరుద్యోగ యువకుల కోసం జి.ఎం.ఆర్,జి.వి.కె కంపెనీల సౌజన్యంతో సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ ఉద్యోగాలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సీఐ ఎల్.అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. 160 నుంచి 167 సెంటీమీటర్ల ఎత్తు ఉండి,పదోతరగతి (పాస్/ఫెయిల్) చదువుకున్న వారు అర్హులని పేర్కొన్నారు.

సచివాలయ కార్యదర్శుల సేవలపై అసంతృప్తి

దత్తిరాజేరు: మండలంలోని గడసాం సచివాలయం కార్యదర్శి శ్రీనివాసరావు, చినకాద కార్యదర్శి సూరినాయుడు, కె.కృష్ణాపురం కార్యదర్శి శివరామ కృష్ణ, దత్తిరాజేరు కార్యదర్శి సంగమేష్‌ల సేవలపై ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వాణిశ్రీ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వీరి హాజరు సరిగా లేదన్నారు. సచివాలయంలో స్పందన కార్యక్రమాలకు డుమ్మా కొట్టడం, అధికారుల ఫోన్‌లకు స్పందించడం లేదని చెప్పారు. వీరి పనితీరుపై ఇటీవల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు,ఎంపీటీసీ లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారని, అయినా మార్పురాలేదని అసహనం వ్యక్తం చేశారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

నేత్ర వైద్యశిబిరం రేపు

దత్తిరాజేరు: పెదమానాపురం పోలీస్ స్టేషన్ వద్ద సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ ఉదయం నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ మంగళవారం తెలిపారు. కంటిసమస్యలున్న వారు ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డు తీసుకొని శిబిరానికి రావాలని సూచించారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

వేపాడ: గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి ఈఓపీఆర్డీ సూర్యనారాయణ సూచించారు.నల్లబిల్లి గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు.ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రజలకు అవగాహన కల్పించా లని ఆదేశించారు.

భూరీసర్వేతో రైతులకు మేలు

గజపతినగరం రూరల్: సమగ్ర భూరీసర్వేతో భూసమస్యలు పరిష్కారమవుతాయని, రైతులకు రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని మండల సర్వేయర్ యజ్ఞేశ్వరరావు తెలిపారు. బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాల్లో మంగళవారం భూరీసర్వే నిర్వహించారు.గ్రామ పెద్దలు కనకల సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు

గజపతినగరం: మహిళల స్వయం ఉపాధికి బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇచ్చి తోడ్పాటు అందించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఎల్‌డీఎం శ్రీనివాస్ కోరారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో మండల స్థాయి సంయుక్త బ్యాంకర్ల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు చిరువ్యాపారాలు, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రాయితీతో కూడిన రుణాలను బ్యాంకర్లు ఇప్పటికే అందిస్తున్నారని, సకాలంలో రుణాలు చెల్లిస్తున్నవారికి మళ్లీ రుణాలు అందించాలని కోరారు. రుణాల మంజూరులో లక్ష్యాలను చేరుకున్న బ్యాంక్ మేనేజర్‌లు ఎం.రమేష్, బి.ఎం. నాయుడును సన్మానించారు. గజపతినగరం ఎస్‌బీఐ మేనేజర్ కిషోర్, దత్తిరాజేరు మండలం బ్యాంక్ మేనేజర్‌లు పాల్గొన్నారు.